# ఆదర్శం

"ఆహా! ఎంత మంచి అబ్బాయి..!'' అనుకుంది అమ్మాయి తల్లి.

''మా అమ్మాయి ఎంతో పుణ్యం చేసుకుని వుంటే తప్ప ఇంత మేలిమి బంగారం, ఆధునికుడు ఇంటల్లుడుగా దొరకడు..'' అనుకున్నాడు అమ్మాయి తండ్రి.

ఆ ఇద్దరూ అలా అనుకోవటానికి కారణం సూరిపండు ఆ పెళ్లి చూపుల్లో కట్నం ప్రసక్తి రానివ్వకపోవటమే.

''బాబు! కట్నమయితే వద్దంటున్నావు...మరి నువ్వు ఉద్యోగం చేసేచోట సొంత ఇల్లు కట్టుకోవాలనిగానీ, వాహనం కొనుక్కోవాలని గాని కోరికలేమైనా వున్నాయా...'' సూరిపండుని అడిగాడు అమ్మాయి తండ్రి.

''అటువంటివేం లేవండి. మీ అమ్మాయిని కట్టుబట్టల్తో నావెంట పంపించేస్తే చాలు..''

అక్కడున్న పెద్దలందరూ సూరిపండు వంక పొగడ్తగా చూశారు. తమ కొడుకు విశాల హృదయానికి, ఆధునిక భావాలకి సూరిపండు తల్లి, తండ్రి గర్వపడ్డారు. సూరిపండుక్కూడా కావలసింది అదే.

సరిగ్గా ఇలాంటి సెంటిమెంట్ల దగ్గరే ఏ మనిషికైనా 'మంచివాడన్న' గుర్తింపు సమాజంలో లభిస్తుంది.

ఇక ఆదాయం విషయం అంటే అమ్మాయి దగ్గర కట్నం రూపంలో పెద్ద లాటు తెచ్చిపడేసినా అది ఏదోకరోజు తరిగే అవకాశం వుంది. అదే అమ్మాయి చేత జాబ్ చేయిస్తే మరింత లాభం వుంటుంది. చాలామంది ముందుగానే పెద్ద ఎత్తున కానుకలు రావాలని కోరుకుంటారే తప్ప, తనలా సూక్ష్మదృష్టితో ఆలోచించరు.

ఇటు ఆదాయం వున్నట్టుంటుంది, అటు సంఘంలో మంచిపేరు సంపాదించుకున్నట్టు వుంటుంది. తన ఆలోచనకి తనే మెచ్చుకున్నాడు సూరిపండు.

అందుకే తమ తల్లి, తండ్రి మొదట పెళ్లి సంబంధాలు చూస్తున్నాం అన్నప్పుడు చెప్పాడు- కట్న కానుకలు వద్దని, అమ్మాయి కాస్తంత చదువుకున్నది, నలుగుర్లో ఫ్రీగా మూవ్ అవ్వగలిగేది అయితే చాలునని.

వెంటనే ఇంటర్ పూర్తిచేసిన ఈ అమ్మాయిని చూసి ఉత్తరం రాశారు.


అది చాలు! ఆ అమ్మాయి చదువుకి తను పని చేసే ఆఫీసులోనే క్లర్క్ పోస్ట్ ఖాళీ అవుతుంది. తన బాస్‌కి తన మాటంటే వేదవాక్కు. ఇద్దరి జీతంతో ఇంచక్కా జీవితం మూడు కొవ్వొత్తులు- ఆరు అగరుబత్తులు.

తాంబూలాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పురోహితుడు లగ్నం డేటు ఫిక్స్ చేశాడు.

★ ★ ★

పెళ్లి జరిగింది. అబ్బాయి, అమ్మాయి చిలకాగోరింకల్లా వున్నారని కొందరు, ఇంత మంచి మనసున్న అబ్బాయితో అమ్మాయి కాపురం మర్రిచెట్టు, వేపచెట్టు బంధంలా పెనవేసుకుపోతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు, పైకే అన్నారు.

ఆ రెండు మూడ్రోజులు దూరపు ఊళ్ళ బంధువులు, స్నేహితులకి వీడ్కోళ్ళతోనే సరిపోయింది.



భార్యతో ఒంటరిగా కూర్చుని మనసు విప్పి మాట్లాడుకోటానికి ముహూర్తం ఆరోజు-

''మీరు కట్నం ఎందుకొద్దన్నారు..?'' సిగ్గు, బిడియం..మొదలైన గడపలన్నిటినీ దాటుకుని బైటికొచ్చాక అడిగింది అమ్మాయి.

''నావన్నీ ఆధునిక భావాల్లే. అయినా, స్త్రీలు అంటే సబలలు. పురుషులతో ఏ రంగంలోనైనా సమానస్థాయిలో పోటీపడుతున్న ఈరోజుల్లో ఒక వయసొచ్చాక మన సంపాదనేదో మనం కలిసిమెలిసి చూసుకోవాలిగాని తల్లిదండ్రులకి భారం కాకూడదు'' చెప్పాడు తను భార్య దృష్టిలోను మంచివాడవ్వాలన్న తపనతో.

అతడూహించినట్టే అమ్మాయి మనసులో రవ్వంత గర్వపడింది తన భర్త స్త్రీలకి యమ సపోర్టు అనుకుని.

''అంటే నన్నిప్పుడు సంపాదనలోకి దింపబోతున్నారన్నమాట!'' అంది.

''అవును! మనం సిటీకి వెళ్ళాక మొట్టమొదట చెయ్యవలసిందేమిటో తెలుసా... నీ ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్లు బయోడేటాకి అటాచ్ చేసి మా ఆఫీసులోనే జాయిన్ కావటం..''

''ఆ..నేను ఇంటర్మీడియెట్ చదివానని ఎవరు చెప్పారు?'' అడిగిందమ్మాయి ఆశ్చర్యంగా.

''ఎవరో చెప్పటం ఏమిటి! పన్నెండు సంవత్సరాల చదువంటే ఇంటర్మీడియెట్ కాదా!''

''కాదు..''

''మరి..''

''అప్పటికి నేను తొమ్మిదే..'' చెప్పింది.

అంతే..సూరిపండు నోట్లో వెలగపండు పడింది. దాంతో ఆమెనుంచి ఏమీ ఆశించకపోవడమే మంచిదన్న అభిప్రాయానికొచ్చాడు.

**-పావులూరి శివాజీ**

**(తుర్లపాడు)**